# జాతకఫలం

యద్దనపూడి సులోచనారాణి

"నర్స్"

"యస్, డాక్టర్."

"నంబరు 8 గదిలో పేషెంట్ జాగ్రత్త. 15 రోజులక్రితం మన నర్సింగ్ హోమ్‌లో లేడీ పేషెంట్ చనిపోయింది గుర్తుందా! సరిగ్గా అదే జ్వరం. జాగ్రత్తగా కనిపెట్టి వుండాలి నువ్వు. నేనిచ్చిన మందులు గంటగంటకి వెయ్యి. ప్రతి అరగంటకి పల్స్‌లో యేమైనా మార్పు వుందేమో పరీక్ష చెయ్. తెల్లవారుఝామున నాలుగ్గంటలకి వచ్చి నేను మళ్ళీ యింకో యింజెక్షన్ యిస్తాను." అని ఆదేశించి డాక్టరు గారు వెళ్ళిపోయారు. నేను నంబరు 8 గదివైపు నడిచాను.

గదిలో లైటు వెలుగుతోంది. మంచం మీద వున్న రోగి తీవ్రంగా మూలుగుతున్నాడు. భరించలేని అశాంతితో అటు యిటు చేపపిల్లలా కొట్టుకుంటున్న అతన్ని చూస్తుంటే జ్వరం తీవ్రంగా వుందని స్పష్టంగా తెలుస్తోంది.

నేను వెళ్ళి నిశ్శబ్దంగా ప్రక్కనున్న కుర్చీలో కూర్చున్నాను. పల్స చూడటానికి చెయి అందుకుంటే వెచ్చగా మాడిపోతోంది.

"అబ్బా! ప్రాణం పోతోంది. దాహం. నాలుక పిడుచకట్టుకుపోతోంది."

గ్లూకోస్ నీళ్ళు తెచ్చి రెండు మూడు చెంచాలు అతని నోటికి అందిచ్చాను.

క్షణంసేపు అతని మూలుగు ఆగిపోయింది. నాలుకతో పెదవులు తడుపుకుంటూ పడుకున్నాడు.

అప్పటివరకూ రెప్ప వాల్చకుండా అతనివైపు చూస్తున్న నాకు అతన్ని గుర్తు పట్టినకొద్దీ క్రమంగా గుండెలు కొట్టుకోవటం మొదలుపెట్టాయి. నిజమా! ఇది సంభవమా! లేక నా కళ్ళు భ్రమిస్తున్నాయా అన్పించసాగింది.

కొద్దిసేపు శాంతించిన అతని శరీరంలో మళ్లీ ఆరాటం మొదలైంది. చేతులు కొట్టుకున్నాయి. ఒళ్ళంతా తీగెలా సాగింది. మళ్ళీ మూలుగు ప్రారంభమైంది.

చెదిరిపోయిన దుప్పటిని లేచి సరిచేస్తున్న నన్ను అతను కళ్ళు తెరిచి చూస్తూ 'నర్స్' అన్నాడు.

"మీరు శాంతంగా పడుకోడానికి ప్రయత్నం చేయండి;" మృదువుగా అన్నాను.

గిలగిలా కొట్టుకుంటున్న అతని చేతులు హఠాత్తుగా వచ్చి నా రెండు చేతుల్నీ గట్టిగా పట్టుకున్నాయి. జ్వరంతో యెరుపెక్కి తీక్షణంగావున్న కళ్ళతో "నర్స్! నిజం చెప్పు, నాకీజ్వరం నయం అవుతుందా?" అన్నాడు.

"నయం అవుతుంది."

"మీ నర్సులు, డాక్టర్లు అంతా అలాగే చెప్తారు. అలా చెప్పకపోతే యింకెలా చెప్తారు మరి." పట్టుకున్నంత హఠాత్తుగా మళ్లీ అంత వేగంగా నా చేతులు తోసేశాడు.

"మీరు నిద్రపోవాలి. మీకు విశ్రాంతి చాలా అవసరం."

"యెలా నిద్రపోనూ! నా ఒళ్ళంతా మంటల్లో కాల్చినట్టుంటే! యెముకల్ని పిండిపిండిగా విరక్కొట్టినట్టుంది! నిద్ర యెలా వస్తుంది?"

ఆ సంగతి నాకుమాత్రం తెలియదూ! ఆరోగ్యంగా, విశ్రాంతిగా వుంటే యీ నర్సింగ్ హోమ్‌కి రావాల్సిన అవసరం యేముంటుంది

"నర్స్ ఒక వేళ - ఒక వేళ - నా ప్రాణం పోతే?—"

"పోదు."

"పోదని నీకెలా తెలుసు? నాకెప్పుడూ యిలాంటి జ్వరం, యింత తీవ్రంగా యేనాడూ రాలేదు. నర్స్. నేను - నేను చావుకి భయపడ్తున్నానని అనుకోకు. పుట్టినతర్వాత యెప్పుడో ఒప్పుడు చావక తప్పదు. కాని - కాని - నాకిద్దరు పిల్లలున్నారు. అభంశుభం తెలియని చిన్న పిల్లలు. నా భార్యకూడా ఒట్టి అమాయకురాలు. యీ ప్రపంచపు పోకడ అర్థం చేసుకోలేని మూర్ఖురాలు. వాళ్ళకోసం - వాళ్ళకోసమే నేను బ్రతకాలి."

దుప్పటి అంచులు సరిచేస్తున్న నా చేతులు దాన్ని గట్టిగా బిగుసుకున్నాయి. నా మనసులో కలిగిన వుద్విగ్నమైన భావాన్ని నిగ్రహించుకోటానికి పెదవుల్ని పంటితో గట్టిగా నొక్కిపట్టాల్సివచ్చింది. అతని మాటలు వింటున్నకొద్దీ క్రమంగా నాలో శక్తిని అజ్ఞాతశక్తి యేదో హరించటం ప్రారంభించింది.

"చెప్పు, నర్స్. మాట్లాడవేం? అలా తలవంచుకుని నిలబడ్తావెందుకు? నిజం చెప్పు; నాకేం ఫర్వాలేదా? డాక్టర్ యేమన్నాడు? ఇది విషజ్వరమని, దీనివల్ల యీమధ్య చాలామంది చనిపోయారని నాకు తెలుసు. నిజంగా నాకు తగ్గుతుందా? మళ్లీ నా యీ కళ్లతో సజీవంగా నా భార్యాపిల్లల్ని చూడగలనా?—"

నేను సమాధానం చెప్పలేదు. అదే యింకో వ్యక్తి అయితే నర్సుగా నేను చాలా ఆప్యాయంగా మాట్లాడేదాన్ని. కానీ - యీ వ్యక్తి - యితను వేరు. ఇతని ముందు పెదవి కదిపే శక్తికూడా నాలో లేదు.

"వూరుగానివూళ్లో, నా అనేవాళ్ళు లేని ఈ ప్రదేశంలో — యేదో పనిమీద

వచ్చిన నాకు, నా కేదయినా అయితే-"

అతని కనుబొమలు ఆలోచనా పూర్వకంగా ముడిపడ్డాయి. క్షణం ఆగి మళ్ళీ చటుక్కున నా చెయి అందుకుంటూ "నర్స్, ఒకవేళ - ఒకవేళ నా ప్రాణం పోతే - తర్వాత - నా భార్యకి ఆఖరి క్షణంలో తననే తలుచుకుంటూ ప్రాణం వదిలానని చెప్పు. చెప్తావుకదూ! తప్పకుండా చెప్తానని వాగ్దానం చెయ్యి."

అతనివైపు వెర్రిగాచూసిన నేను "డాక్టర్ని పిలుచుకువస్తాను-" అంటూ నా చేతిని గుంజుకుని మరుక్షణంలో సుడిగాలిలా బైటకి పరుగెత్తాను.

అరగంట తర్వాత డాక్టరు యిచ్చిన యింజెక్షన్‌తో అతని కళ్ళు మూతలు పడిపోయినాయి.

డాక్టరు గదిలోంచి వెళ్ళబోతూ "జాగ్రత్త. పదినిమిషాలకి ఓసారి పల్స్ కౌంట్ చేసుకో. ఒకవేళ నువ్వు నిద్రకి ఆగలేకపోతే 12 గంటల తర్వాత ఇంకో నర్స్‌ని తీసుకొచ్చి కూర్చోపెట్టు." అని హెచ్చరించి వెళ్ళిపోయాడు.

ఆయన్ని సాగనంపి తిరిగివచ్చి కుర్చీలో కూలబడ్డాను. అంతక్రితంవరకూ తనంత ఖంగారుపడి నన్ను ఖంగారుపెట్టిన అతను పసిపిల్లవాడిలా తల ప్రక్కకు వాల్చి నిద్రపోతున్నాడు. నిద్రలోకూడా, ఆ ముఖంలో, ఆ పడుకునే తీరులో అస్వస్థత, జ్వరతీవ్రత కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. అతనివైపు అలా చూస్తుండగానే క్రమంగా నా కళ్ళనిండా నీళ్లు నిండుకున్నాయి. చాలా సేపటినుంచి బలవంతాన నిగ్రహించుకుంటున్న దుఃఖం ఒక్కసారి వెల్లువలా పొంగింది. రెండు చేతుల్లో ముఖం దాచుకుని నిశ్శబ్దంగా రోదించసాగాను. "భగవాన్, నే నేం పాపం చేశాను. నా కెందుకీ శిక్ష." అన్పించటం మొదలుపెట్టింది.

కొద్దిసేపయి:తర్వాత డాక్టర్ హెచ్చరిక గుర్తురాగానే వులిక్కిపడి అలా వెక్కిళ్ళ మధ్యనే చెయి తీసుకుని నాడి పరీక్షచేశాను. మార్పేమీ కన్పించలేదు. స్పృహలేని ఆ చేతిని వెంటనే వదల్లేక అలాగే పట్టుకుని చూస్తుండిపోయాను. మళ్ళీ కళ్ళనిండా నీళ్ళు నిండినాయి. దాదాపు 10 సంవత్సరాలక్రితం యీ చెయ్యి నా చేతిని పట్టుకుని అగ్నిచుట్టూ తిరిగింది. మరోచేత్తో కలిసి పవిత్రమైన మాంగల్యం నా మెడలో ముడివేసింది.

'నా కిద్దరు పిల్లలున్నారు. నా భార్య ఒట్టి అమాయకురాలు.' వాడి శూలాల్లా వచ్చి గుచ్చుకున్నాయి ఆ మాటలు. అవి గుర్తు రాగానే చేతుల్లో సర్పం పట్టుకున్నట్టు, అది గమనించి భయపడి వదిలేసినట్టు వదిలేశాను.

"ఒకవేళ నేను చచ్చిపోతే ఆఖరి క్షణంలో తననే తల్చుకున్నానని నా భార్యకి తెలియజేస్తావా? వాగ్దానం చెయ్యి." భగవాన్! ఈ వూళ్ళో యిన్ని హాస్పిటల్స్ వుండగా యీ నర్సింగ్ హోమ్‌కే యెందుకు రావాలి? ఈరాత్రి డ్యూటీ పద్మకిగాని మరొకరికిగాని పడకుండా నాకే యెందుకు పడాలి! నేనక్కడ కూర్చోలేకపోయాను. అతన్ని యెంత రోగిగా చూడాలనుకున్నా నా శక్తి చాలలేదు. వృత్తిధర్మాన్ని మరేదో బాధవచ్చి జయించింది. అందుకే లేచి బైటకి వచ్చేశాను.

వెన్నెలరాత్రులు కాకపోవటంవల్ల బైటంతా చీకటిగావుంది. ప్రకృతే అలిసిపోయి ఆదమరిచి నిద్రపోతుందా అన్పించేట్టున్న ఆ సమయంలో ఆ నిశ్శబ్దంలోంచి దూరంగా చర్చిలో 12 గంటలు కొట్టడం విన్పించింది. యేనాడో తెగిపోయిన బంధానికి యెందుకీ బాధ. యెందుకీ ఆక్రోశం. తిరిగి తీసుకోలేని గతంకోసం ఆవేదన పడటం యెంత మూర్ఖత్వం. అతనికి మరోపెళ్ళి అయింది. పిల్లలున్నారు. ఈ ప్రపంచంలో శైలజ అనే ఓ నిర్భాగ్యురాలు వుందని అతనికి గుర్తు కూడా లేదు. అతను ఆనందంగానే వున్నాడు. జీవితం అన్నివిధాలా అతనికి సంతృప్తికరంగా గడుస్తున్నట్టే వుంది. మరి అలాటప్పుడు నా కెందుకు యీ శిక్ష? నే నేం పాపం చేశాను.

వరండాలో స్థంభానికి చేరగిలబడి బైట చీకట్లోకి రెప్ప వాల్చకుండా చూస్తున్న నా కళ్ళముందు గతం తిరగసాగింది.

నేను పేదకుటుంబంలో పుట్టినమాట వాస్తవమే. కాని అభిమాన ధనానికి నా కేనాడూ కొరతలేకపోయింది. ఆత్మీయత అనే సంపద నా కిప్పుడు పుష్కలంగానే లభించింది. అమ్మ, అన్నయ్య నన్ను అపురూపంగా పెంచి యీ ప్రపంచంలో నాకూ ఓ ప్రత్యేకత వుంది అనే భావం నాలో యేర్పరిచారు. వున్నదాంట్లోనే సంతృప్తిగా ఒడిదుడుకనేది యెరుగకుండా 16 సంవత్సరాలు గడిపాను. అన్నయ్య కాలేజి చదువుకి పట్నం వెళ్ళాడు. ఇంటివద్దనుంచి సకాలానికి జీతానికి, తిండికి డబ్బు పంపలేకపోయేవాళ్ళం. అయినా అన్నయ్య చదువు యెక్కడా ఆగలేదు. యేం తిన్నాడో, యెక్కడుండేవాడో ఆ భగవంతుడికే తెలుసు. ప్రతిసారీ శలవులకి వచ్చినప్పుడల్లా హుషారుగా, కావలసినన్ని కబుర్లతో, అమ్మకి, నాకు చిన్న చిన్న ప్రెజెంటేషన్స్‌తో వచ్చేవాడు.

ఆఖరి సంవత్సరం. ఆ సంవత్సరం గడిస్తే అందరం గట్టెక్కుతాం. అన్నయ్యకి డిగ్రీ వస్తుంది. మా దరిద్రం తీరుతుంది. ఆఖరిసారి కట్టాల్సిన పరీక్షకి అమ్మ ఒంటిమీద బంగారం మిగిలిందికాస్తా అయిపోయింది. యెప్పుడెప్పుడు పరీక్ష లయిపోతాయా అని అమ్మా, నేనూ రోజులు లెక్కపెట్టుకుంటూ కాలంగడుపుతున్నాం. కానీ పరీక్షలకి ముందే అన్నయ్య ఇంటికి వచ్చేశాడు. వూరికేరాలేదు. వెంట

మహామ్మారిలాటి జ్వరాన్ని వెంటపెట్టుకుని వచ్చాడు.

"అమ్మా! నీ చల్లని స్పర్శ తగిలి త్వరగా నయం అవుతుందని మూర్ఖంచేసి వచ్చేశాను. పరీక్షలు దగ్గరకి వస్తున్నాయి." అప్పటికే బలహీనమైన అన్నయ్యా పెదవులమీద శుష్కహాసం మెరిసింది.

రోజులు గడుస్తున్నాయి. పరీక్షలు దగ్గర పడ్తున్నాయి. కానీ జ్వరం తగ్గటం లేదు. అమ్మా, నేనూ చేయవలసిందంతా చేస్తున్నాం. మా వూళ్లో మా అందరికీ మందిచ్చే ఆచార్యులుగారు ఏవేవో శ్లోకాలు చదివి, పిత్తం, పైత్యం అంటూ నల్లటిమాత్రలు, రసాలు అన్నయ్యచేత మింగిస్తూనే వున్నాడు. అయినా జ్వరం జారటంలేదు. పరీక్షలమాట దేవు డెరుగు. అన్నయ్య కోలుకుంటే చాలని అమ్మ భగవంతుడికి ముడుపులు కట్టటం ప్రారంభించింది.

అన్నయ్య ఓ రోజు ఓపిక తెచ్చుకుని లేచి కూర్చుని నాచేత పట్నంలో వున్న తన మిత్రుడు సారధి అనే అతనికి వుత్తరం వ్రాయించాడు.

"నీ పిచ్చిగాని, పరీక్షలముందు అతను వస్తాడా అన్నయ్యా?" అన్నాను నేను.

"వస్తాడు." అన్నాడు ధృడంగా.

నాలుగైదు రోజులు గడిచినాయి. అన్నయ్య క్షీణించి శల్యంలా తయారై మంచానికి అంటుకుపోయాడు. చాలా సేపు పిలిస్తేకాని పలకటంలేదు.

ఆ రోజు సాయంత్రం నేను చెరువు నుంచి మంచినీళ్ళబిందె చంకన పెట్టుకుని యింటికి వచ్చేసరికి అన్నయ్యా మంచంమీద తెల్లగా, సన్నగా, పట్నవాసపు నాజూకుతనం అంతా మూర్తీభవించినట్టున్న ఒకతను కూర్చుని వున్నాడు. అన్నయ్య ఓపిక చేసుకుని లేచి కూర్చుని మాట్లాడుతున్నాడు. నన్ను చూడగానే అన్నయ్య "శైల" అన్నాడు. అతను 'తెలుసు



కున్నాను' అన్నట్టు నావైపు చూసి నవ్వాడు. నేను చప్పున లోపలికి వెళ్ళిపోయాను. ఆ తొందరలో నా చేతుల్లో వున్న కలువపువుల్లో యెర్రకలువ ఒకటి జారి క్రిందపడిందని నాకు తెలియదు.

"అతనే సారధి! పాపం! రోడ్డుదగ్గర దిగి ఎనిమిది మైళ్లూ నడిచి వచ్చాట్ట!" కాఫీ కలుపుతూ అంది అమ్మ.

ఇత్తడి గ్లాసు ఒకటి బలంగా రెండుసార్లు తోమి తెల్లగా మెరుస్తోంది అన్న నమ్మకం కుదిరిన తర్వాత తెచ్చి అమ్మకిచ్చాను. అమ్మ అందులో కాఫీ పోసి 'తీసుకెళ్ళి యివ్వు' అంది.

నేను కాఫీ గ్లాసు తెచ్చేసరికి అతను చేతుల్లో యెర్ర కలువని పట్టుకుని దాని రేకులు సరిచేస్తూ అన్నయ్యతో "భయపడకు వాసూ. నేను వచ్చానుగా. ఫర్వాలేదు. నీకిక్కడ వైద్యసహాయంలేదు. రేపే పట్నం తీసుకువెడ్తాను." అంటున్నాడు. అతన్ని చూసిన తర్వాత నాకు ధైర్యం వచ్చింది. అన్నయ్యకి ఫర్వాలేదు అనే నమ్మకం కుదిరింది. అమ్మకూడా అలాగే అంది.

నేనిచ్చిన కాఫీ గ్లాసు అందుకుంటూ అతను నావైపు చూసిన చూపు చిత్రంగా వుంది; నాకెందుకో సిగ్గేసింది.

"నీకు పువ్వులంటే యిష్టమా?—" జేబురుమాలు తీసి గ్లాసు కాలకుండా పట్టుకుంటూ అన్నాడు.

అవునన్నట్టు తలూపాను.

తర్వాత యెంతో కాలంనుంచీ పరిచయం వున్నవాడిలా అన్నయ్య మందు సంగతి, యింటిసంగతులు యింకా

యెన్నెన్నో అడిగాడు. నాకుకూడా సంకోచం అన్పించలేదు. చనువుగానే జవాబు చెప్పాను.

మర్నాడు అతను ప్రయాణానికి సిద్ధం చేస్తుంటే ఇరుగు, పొరుగువాళ్ళు తిథి, వారం బాగా లేదంటూ ఆపేసారు. ఆ మర్నాడు సాయంత్రం బైలుదేరటానికి ప్రయాణ సన్నాహం జరిగింది. కానీ తెల్లవారనేలేదు. ఆరాత్రి అన్నయ్య పరిస్థితి విషమించింది. ఆచార్లుగారు వచ్చి నాడి చూసి పెదవి విరిచేశాడు. అమ్మ ఘొల్లుమంటూ అన్నయ్యమీదపడి యేడవటం ప్రారంభించింది. నాక్కూడా యేడుపు ఆగలేదు. మేం అలా వాడిమీద పడి యేడుస్తుండగానే అన్నయ్యకి వెక్కిళ్ళు రావటం ప్రారంభించాయి. వెక్కిళ్ళు తగ్గినాయి అనుకున్నాను. కానీ నాకేం తెలుసు, అది ప్రాణం పోవటం అని.

నేను చూస్తుండగానే అన్నయ్య ప్రాణాలు వదిలాడు. కాని యిదెలా సాధ్యం! అన్నయ్యా నేనూ ఒకప్రాణంగా మెలిగాం. కలిసి జీవించాం. అన్నయ్య చచ్చిపోయి నేను బ్రతకటం యెలా జరిగింది అమ్మ హృదయవిదారకంగా యేడుస్తోంది. నాలో సజీవమైన శక్తి యేదో మంచు తాకినట్టు మొద్దుబారిపోయింది.

ఏడుపూ రాలేదు నాకు. అలాగే బిగుసుకు పోయినట్లు చూస్తూండి పోయాను.

యెవరో 'శైలా - శైలా' అని పిలిచారు. భుజాలుపట్టి కదిపారు. తిరిగి చూశాను 'శైలా!' సారధి నన్ను ఒళ్ళోకి లాక్కుని బావురుమన్నాడు

అన్నయ్య దహన సంస్కారాలకి కావలసిన యేర్పాట్లన్నీ అతనే స్వయంగా చూశాడు. తన చేతులమీదనుంచే ఆ కర్మకాండలన్నీ ముగించాడు. పదిహేను రోజులు యిట్టె జరిగిపోయినాయి. అతని పరీక్షలు నాలుగురోజుల్లోకి వచ్చాయి. వెళ్ళక తప్పలేదు.

వెళ్ళిపోయేముందు తన పేరుతో అడ్రస్‌లు వ్రాసిన కవర్లు కొన్ని నాచేతికిస్తూ "శైలూ! నాలుగురోజులకోసారి అమ్మా, నువ్వూ యెలావుందీ నాకు వుత్తరం వ్రాస్తావుకదూ?" అన్నాడు. అలాగేనని తలూపాను. ఇంకో కవరు అందిస్తూ "ఇదిగో యిందులో డబ్బుంది. వాడుకో. యింకా అవసరం అయితే నాకు వుత్తరం వ్రాయి. నేను పరీక్షలు అయిపోగానే మళ్ళీ వస్తాను." అన్నాడు.

ఆ నాలుగు రోజుల్లోనే వూళ్ళోవాళ్ళంతా యేదయినా సంబంధం చూసి నాకా మూడుముళ్ళు వేయించి పుణ్యం కట్టుకోమని సలహా యిచ్చారు. అతనెందుకో అదంత పట్టించుకున్నట్టులేదు.

అతను వెళ్ళిపోయేరోజు వచ్చింది. అమ్మ లోపలిగదిలో వెక్కి-వెక్కి యేడుస్తోంది. నేనే వీడ్కోలు యిచ్చాను.

"డబ్బుకి యిబ్బంది పడొద్దు." అన్నాడతను మరోసారి గుర్తుచేస్తూ.

"ఇదిచాలు" అన్నాను.

"శలవు లివ్వగానే సరాసరి యిక్కడికే వస్తాను. అప్పుడేం చెయ్యాల్సిందీ చెప్తాను. సరేనా ?-"

అంగీకారం సూచిస్తూ తలవూపాను.

"అమ్మ జాగ్రత్త." అదీ ఆఖరిమాట.

సారధి వెళ్ళిపోయాడు. రోజులు గడుస్తున్నాయి. అమ్మ పూర్తిగా మంచం యెక్కి దిగటం మానేసింది. ఇంట్లో పనంతా చాతయి చాతగానట్టు నేనే చూస్తున్నాను. నా జీవితం శూన్యమైపోయింది. చక్కగా విన్పిస్తున్న గానం ఒక్కసారి ఆగిపోతే యెలాటి నిశ్శబ్దత యేర్పడుతుందో నా కలావుంది జీవితం. సారధి యిచ్చినడబ్బుతో ఆర్థికంగా యిబ్బందిలేకుండా గడిచిపోతోంది. నేను చాలా జాగ్రత్తగా పొదుపుగా వాడుతున్నాను కూడా.

వూళ్ళో మా శ్రేయోభిలాషులు కొందరు ఒక సంబంధం తీసుకొచ్చారు. మా వూరికి పది మైళ్ళ దూరంలోవున్న ఓ పెద్ద పల్లెటూరుకి అతను మునసబు చేస్తున్నాడు. మొదటి భార్య యీ మధ్యనే ప్రసవించలేక చనిపోయి ఆర్నెల్లయిందిట. నలుగురు పిల్లలున్నారు. పొలం బాగానేవుంది. పాడీపంటా సమృద్ధిగ వున్న కుటుంబం. అమ్మకీ సంబంధం నచ్చింది. అతను నేను ఒప్పుకుంటే కట్నం అవీ యేమీ అవసరంలేదని, రెండువైపులా పెళ్ళిఖర్చు తనే భరిస్తానని కబురుచేశాడు.

అమ్మపోరుమీద నేనీ సంగతి సారధికి వుత్తరం వ్రాయక తప్పలేదు, అమ్మ వ్రాసినట్టు వ్రాశాను.

తిరుగుటపాలో వెంటనే జవాబు వచ్చింది. అందులో యిలా వుంది. "శైలూ! నీకేమైనా మతిపోయిందా? పిచ్చిపిచ్చి ఆలోచన్లు మానెయ్యి. నాలుగయిదు రోజుల్లో పరీక్షలు అయిపోతాయి. నేను వస్తాను."

ఆ వుత్తరం చూసింతర్వాత నాగుండెలమీదనుంచి పెద్ద బరువు దించినట్టయింది. అమ్మకి చదివి వినిపిస్తే ముఖం మాడ్చుకుని "యీయన వచ్చి చేసే దేమిటి ? బంగారంలాంటి సంబంధం. చెయి దాటిపోతే—'' అంది. వారంపదిరోజులు గడువు యిమ్మని మునసబుగార్కి కబురు చేసింది.

సారధి అన్నట్టుగానే వచ్చాడు. ఆ సాయంత్రం నాకు బాగా గుర్తుంది.

అమ్మ దగ్గర కూర్చుని "శైలజని నేను చేసుకుంటాను." అన్నాడు.

లాంతరు గ్లాసులు తుడుస్తున్న నా చేతులు క్షణంసేపు యీ మాటలు వినగానే వణికినాయి నా చెవులనే నేనమ్మలేకపోయాను. గాఢాంధకారంలో యెక్కడో మినుకుమినుకు మంటున్న చిన్న వెలుగుకిరణం అంతలయి యింత అయి అన్నట్టు హఠాత్తుగా ఒక్కసారి పెరిగి నా మనసంతా ఆవరించుకుంది.

అక్కడే అలాగే శిలాప్రతిమలా కూర్చుండి పోయాను.

"కాని ఒక్కటి. నేనిక్కడే నిరాడంబరంగా చేసేసుకుంటాను." అన్నాడు.

అమ్మ దీనికి ఒప్పుకోలేదు. వాళ్ళమ్మకి చెప్పి ఆవిడ అనుమతి పొందాలని గట్టి పట్టుపట్టింది. అమ్మ చాదస్తానికి నాకు విసుగేసింది. అవన్నీ అతను ఆలోచించుకోలేడా? మనం చెప్పాలా?

సారథి సరేనని వెళ్ళాడు. నాలుగైదు రోజులతర్వాత వుత్తరంవచ్చింది. అందులో తల్లి ఒప్పుకుందనీ, ముహూర్తంకూడా నిర్ణయించుకున్నామనీ వ్రాశాడు.

శుభలేఖలుకూడా స్వయంగా ప్రింట్ చేయించి పంపాడు. అది చూసినతర్వాత అమ్మ సంతృప్తిగా నిట్టూర్చింది. నన్ను దగ్గరకు లాక్కుని "శైలా! నీ జాతకం యింత గొప్పదంటే నేనే నమ్మలేకపోతున్నాను." అంది.

సారథి నాకు భర్త కాబోతున్నాడని తెలుసుకున్న వెంటనే అందరూ వచ్చి నా అదృష్టాన్నిగురించి పొగిడి వెళ్ళారు.

పెళ్ళికి యెక్కువమంది రాలేదు. వివాహం సారథి కోరినట్టే చాలా నిరాడంబరంగా జరిగిపోయింది. సారథి ముడి వేసిన ఆ మాంగల్యాన్ని చేత్తో పదేపదే తడిమి చూసుకున్న నేను. నా అదృష్టానికి నాకే భయం వేసింది. సారథి నా భర్తా! నిజంగా నేనతని భార్యనేనా! హఠాత్తుగా వుజ్జ్వలంగా భాసించిన యీ కాంతితో నా కళ్ళు వాస్తవాన్ని గ్రహించలేనట్టు గుడ్డివైనాయి.

మూడు నిద్దర్లకి సారథి వూరు వెళ్ళాడు. నాకింకెవరూ లేకపోవడంవల్ల నేను ఒక్కదాన్ని రావాల్సివచ్చింది. అక్కడ సారథి యిల్లూ, ఆ వాతావరణం. ఆ మనుష్యులు. ఆ వేషభాషలూ చూసి దిమ్మెరపోయాను. సారథి తల్లి నన్ను ఆప్యాయంగా ఆదరించనూలేదు. నిర్లక్ష్యంగా తిరస్కరించనూలేదు. అంటీ ముట్టనట్టుగా వుండిపోయింది.




రెండురోజులు గడిచిపోయినాయి. మూడోరోజు సాయంత్రం యింటికి దక్షిణంగావున్న పూలమొక్కలవైపు వెళ్ళాము. అక్కడ రకరకాల పూలమొక్కలున్నాయి. గుబురుగా పెరిగిన మామిడి చెట్లుకూడా వున్నాయి. మనుష్యులు కూర్చునేందుకు వీలుగా అక్కడక్కడా రాతి బెంచీలు వున్నాయి.

ఇంకో రెండురోజుల్లో నేనిక్కడనుంచి వెళ్ళిపోతాను. నేను పుట్టిపెరిగిన వాతావరణానికీ యీ వాతావరణానికీ యెంత వ్యత్యాసం. యెలాంటి యిబ్బందులు లేకుండా నేనిక్కడివాళ్ళలో కలిసిపోగలనా? అలా కలిసిపోయేందుకు సారథి నాతో సహకరిస్తాడా? అర్థంలేని యీ ప్రశ్నతో పరధ్యానంగా కూర్చుండిపోయిన నేను అడుగుల చప్పుడు విన్పించినట్టయి వెనక్కు తిరిగి చూడబోయాను. కాని యింతలో రెండు బలమైన చేతులు వచ్చి నా కళ్ళు మూసేసాయి. చేతులు తడిమి చూసాను. మగవాళ్ళ చేతులు. కుడిచేతికి రాయిలేని ఎనామిల్ బంగారపు ఉంగరం వుంది. ఒంటరిగా కూర్చున్న నా కళ్ళు మూసేంతటి ధైర్యం. సాహసం ఆ చిలిపి కోరిక యింకెవరికి వుంటుంది! ఆ స్పర్శ యెవరిదో గ్రహించుకున్న నాకు శరీరం అంతా విద్యుత్ ప్రవహించినట్టయింది.

"యెవరో చెప్పు," కొద్దిగా గరుకుగా నున్న చెంప నా నునుపైన చెంపకి ఆనింది.

"మీరే!" అక్కడెవరూ లేకపోయినా రహస్యంగా జవాబు యిచ్చాను.

"దొంగా! గుర్తుపట్టేశావే!" అంటూ నవ్వుతూ భుజాలు పట్టుకుని తనవైపు తిప్పుకున్నాడు.

"శైలూ!—" యేదో చెప్పబోయిన అతను హఠాత్తుగా ఆగిపోయి, నావైపు చూస్తూండిపోయాడు. నిశ్చలంగా నావైపు రెప్పవాల్చకుండా సూటిగా చూస్తున్న ఆ చూపులో నాపట్ల కోర్కె. అనురాగం. అప్యాయత అన్నీ నిండుగా తొణికిసలాడుతున్నాయి.

"యేమిటి?—"

"ఏదో చెప్పాలనుకున్నాను. కాని గుర్తు రావటంలేదు," అంటూనే మెల్లగా చాలా మెల్లగా నన్ను దగ్గరకు లాక్కుని

గుండెలకి హత్తుకున్నాడు. సృష్టి ఆగిపోయింది. ప్రపంచం అంతా మృదు మధురమైన గానంతో నిండిపోయింది. అతని చేతుల్లో పసిపిల్లగా ఒదిగిపోయాను నేను. ఆ సమయం చాలా క్షణికమే కావచ్చు. కాని అదే నాకు శాశ్వతం అయింది. ఆ రోజు ఆ పరిష్వంగంలోని ఆ మధురిమను నేను చవిచూడకపోయినట్టయితే యిన్ని సంవత్సరాలు నేను ఒంటరిగా మరో పురుషుని స్పర్శయెరుగకుండా వుండేందుకు నిగ్రహం వచ్చేది కాదేమో! బ్రహ్మచారిణిగా యిన్ని సంవత్సరాలు నిష్కళంకంగా గడపటానికి నాకు శక్తి చాలేది కాదేమో! "శైలా!–" అది పిలుపుకాదు. నాలాటి అనుభూతినే తను కూడా పొందుతూ అదేదో చెప్పలేక ఆరాటపడ్తున్న హృదయం యొక్క ఆలాపన.

ఇంతలో దూరంగా 'అబ్బాయి' అన్న మా అత్తగారి పిలుపు విన్పించింది. సారథి నన్ను వదిలేశాడు. నేను మెరుపు తీగెలా యింట్లోకి పరుగెత్తాను.

లోపలికి వెళ్ళేసరికి యిల్లంతా హడావుడిగావుంది. మా అత్తగారు పిన్నత్తగారు సందడిగా మాట్లాడుకుంటున్నారు. నన్ను చూడగానే మా అత్తగారు "అమ్మాయి, చప్పున హాల్లోకి పద, రామానందతీర్థులుగారు వచ్చారు. అబ్బాయి యెక్కడున్నాడో" అంది.

నాకు తర్వాత తెలిసింది. రామానంద తీర్థులుగారు మా అత్తగారికి గురువుగారు. ఆయన ఆశీర్వచనంవల్లనే చాలా కాలానికి లేకలేక సారథ కలిగాడు. యింట్లో యేది జరిగినా, ఆయన ఆశీర్వచనం అందుకుని పని ప్రారంభించటం ఆ యింటి ఆచారం. పెళ్ళికి ముందు ఆయన బదరీనాథ్‌లోవుండటంవల్ల, సారథి ఒకచే తొందరపడటంవల్ల అది వీలుకాలేదు.

నేను ఆవిడ చెప్పినట్టు వెళ్లి బుద్ధిమంతురాలులాగా ఆయన దగ్గిర కూర్చున్నాను. కొద్ది సేపయిం తర్వాత సారథికూడా లోపలికి వచ్చాడు. ఇద్దరం ఆయన పాదాలకి నమస్కరించాం. ఆయన మమ్మల్ని ఆశీర్వదించి కూర్చోమన్నారు.

"త్వరగా మనమడు కలిగేలా నన్ను ఆశీర్వదించండి" అంది మా అత్తగారు.

ఆయన నవ్వి "యేదమ్మా చెయ్యి," అంటూ నా చేతిని తీసుకుని చూడడం ప్రారంభించారు. చూస్తుండగానే ఆయన కనుబొమలు ముడిపడ్డాయి. క్షణంసేపు తలెత్తి నా వైపు తీక్షణంగా చూశాడు. నే నా చూపులకి బెదిరిపోయానని వేరే చెప్పనవసరం లేదు,

"నువ్వు లోపలికి వెళ్లమ్మ!" అన్నారు మళ్ళీ ప్రసన్నంగా. నేను లేచి లోపలికి వెళ్ళిపోయేముందు మళ్ళీ నమస్కరించాను. చిరకాలం జీవించమని నన్ను చేయెత్తి ఆశీర్వదించారు.

ఆ రాత్రి గడిచిపోయింది. మర్నాడు పగలంతా గడిచిపోయింది. తీర్థులుగారు ఆ సాయంత్రం వెళ్ళిపోయారు. అంతా ఆడంబరంగా వీడ్కోలు యిచ్చారు.

లోపలి గదిలో వంటరిగా నిలబడివున్న నా దగ్గరికి సారథి వచ్చి 'శైలా! మంచినీళ్ళు కావాలి' అన్నాడు. నేను వెళ్ళి మంచినీళ్లు తెచ్చియిచ్చాను. గ్లాసు అందుకుంటూ "రాత్రి అంతా నిద్ర పోయిం తర్వాత నిన్నటి చోటకి రా.' అన్నాడు. అది అభ్యర్థనకాదు. ఆదేశం అంతకంటే కాదు. ఆజ్ఞాపించినట్టుంది.

నాకు భయంకంటే సిగ్గెక్కువగా అన్పించింది. అతను నా భర్తే కావచ్చు. అయినా సరే – అలా దొంగతనంగా అందరూ నిద్రపోయిం తర్వాత వెళ్లాలంటే–తప్పదు. సారథి కోర్కెని లేదనే సాహసం నాకులేదు.

యెలాగో ధైర్యం తెచ్చుకుని వెళ్లాను. నేను వెళ్లేసరికే అత డక్కడ కూర్చుని వున్నాడు. ఆ రాత్రి అందులో నిశ్శబ్దం, ఆ వెన్నెల, అందులో తెల్లటి జట్లల్లో కూర్చుని నాకోసం యెదురు చూస్తున్న అతన్ని చూసేసరికి నా భయం మంచులా కరిగిపోయి. సందేహం పటాపంచలైంది. మనను, శరీరం రెండూ తీయని వలపులో మత్తెక్కినాయి. నా అడుగులు చప్పుడు అంత దగ్గరగా వినికూడా అతను తిరిగి చూడలేదు. నే నేం చేస్తానో చూడాలని అలా కూర్చున్నాడేమో! నిన్న అతను చేసిన పనే నన్నీరోజు రెచ్చగొట్టింది. వెనకగా వెళ్ళి కళ్ళు మూశాను. అతను వులిక్కిపడటం చూసి తెల్లబోయాను.

"శైలా!" అన్నాడు చేతులు తడుముతూ.

"భయపడ్డారా?–"

"కాదు. యిలా వచ్చి కూర్చో."

అతనిముఖం, ఆ మాట్లాడే తీరు యెలాగో వుంది. క్షణంసేపు అతి చనువుగా ప్రవర్తించానేమో అన్న అనుమానం నన్ను సిగ్గుపడేలా చేసింది.

ప్రక్కన వచ్చి కూర్చున్నాను. అతవేం మాట్లాడలేదు.

"యేమిటి?" అన్నాను.

"నీకో విషయం చెప్పాలని పిల్చాను."

చెప్పమన్నట్టు చూశాను.

అతను క్రిందికి చూస్తూ అన్నాడు: "శైలా! నేను ఎం. ఏ. చదవా లనుకుంటున్నాను. నిన్నిప్పుడే తీసుకు రావటానికి వీలు పడదేమో!" నాకు నవ్వువచ్చింది. దాని కింత వుపోద్ఘాతం, యింత గంభీరం దేనికో. కోపం వచ్చింది కూడా. ఆమాట చెప్పటానికి అట్లా లోకం ముంచుకుపోయినట్టు కూర్చోవాలా యేమిటి? నవ్వుతూ సరదాగా చెప్పగూడదా!

"అది చెప్పటానికే పిలిచాను."

యేం మాట్లాడాలో నాకు తోచలేదు. నాకు సందేహం వేసింది. "మీ రప్పుడప్పుడు వస్తూంటారుగా!" అన్నాను. వెంటనే సమాధానం రాలేదు. తలతిప్పి అతనివైపు చూశాను. అప్పటికే నన్ను

పరిశీలనగా చూస్తున్న అతను 'ఆ!' అన్నాడు. మళ్ళీ నిశ్శబ్దం. అంతా మత్తెక్కించే వెన్నెల. చక్కటి నిశ్శబ్దం. కొద్దిసేపయింతర్వాత "ఇక వెళ్ళనా?" అన్నాను.

"ఊ!"

నా కెందుకో కోపం వచ్చింది. తీరని అవమానం అన్పించిందిగూడా. నిన్నటి మనిషేనా యితను! వున్నట్టుండి యిలా యెందుకయాడు! తల్లీ కొడుకులమధ్య నా గురించి యేమైనా అభిప్రాయభేదం లేదుకదా! కనీసం ఆప్యాయంగానైనా మాట్లాడడే! దెబ్బ తిన్న మనసుతో చివ్వున లేచి వచ్చేయబోతుండగా అతను చటుక్కున చెయిపట్టుకుని ఆపాడు. తిరిగి చూశాను.

"శైలూ! యెప్పుడైనా నీ కేదయినా నా ద్వారా తీరని బాధ కలిగితే యేం చేస్తావు?-"

చెవులు పిండి యెందుకలా చేశారని అడుగుతాను అనా అనుకున్నా. కాని మనసులో ఆమాట పైకి రాలేదు. నిశ్శబ్దంగా నిలబడిపోయాను.

"రేపు ఉదయం నేను ఫ్రెండ్స్‌తో కలిసి ఢిల్లీ అవీ చూడటానికి వెడ్తున్నాను. బహుశా కాశ్మీర్ కూడా వెళ్ళొచ్చు. రెండు నెలలవరకూ తిరిగిరాను."

రెండు నెలలే! నేను ఆగిపోయాను. అంటే అన్నిరోజులవరకూ అతన్ని చూడలేను. అప్పటివరకూ యిదే ఆఖరిచూపా?

"వుత్తరం వ్రాస్తుంటారుగా!" అడగలేక అడిగాను.

"చెప్పలేను. వూళ్ళు తిరుగుతుంటే అడ్రస్ ఒకటి వుండదు."

"నాకు వ్రాయడానికేం?-"

"అలాగే!- తప్పకుండా వ్రాస్తాను;" నా చెయి నొప్పిపుట్టేంత గట్టిగా నలిపి వదిలేశాడు.

నేను వెళ్ళటానికి రెండడుగులు వేసుగానే అతను నిట్టూర్పు విడవటం విన్పించింది. వెనక్కు తిరిగాను.





"యేం లేదు, వెళ్ళు."

నాకు యేడుపొచ్చినంత పనైంది. యెలా వచ్చాను! యే విధంగా తిరిగి వెడ్తున్నాను! కన్నీళ్ళు దాచుకునే ప్రయత్నంకోసం నడకవేగం పెంచి గబగబా వచ్చేశాను.

మావూరు వచ్చేశాను. 15 రోజుల తర్వాత సారధి దగ్గరనుంచి వుత్తరం వచ్చింది. కొట్టుకునే గుండెలతో, వణుకుతున్న చేతుల్తో కవరు చింపాను. సారధి స్పర్శ తెచ్చిన ఆ వుత్తరం ముట్టుకుంటే అతన్ని తాకినట్టే వుంది. పరిచితమైన ఆ దస్తూరి చూడగానే నా మనసు పురివిప్పిన నెమలిలా నాట్యం ప్రారంభించింది.

కాని — కాని — ఆ వుత్తరం చదువుతుంటే నా ప్రాణాలు యెగిరిపోసాగినాయి.

నేను వూహించినట్టు లేదు ఆవుత్తరం. అందులో యిలా వుంది.

"శైలా!

నువ్వు క్షేమంగా వున్నావని తలుస్తాను. నేను కులాసాగానే వున్నాను. నీకో ముఖ్యవిషయం చెప్పబోతున్నాను. నాకు తెలుసు. నే నెంత బాధ పెట్టబోతున్నానో. కాని అంతకి వేయిరెట్లు యెక్కువగా నేను బాధపడి గత్యంతరంలేక నీకీ వుత్తరం వ్రాస్తున్నానని సంగతి మర్చిపోకు శైలూ! ఆరోజు రామానంద తీర్థులుగారు నీచెయి చూశారు గుర్తుందా? నిన్ను లోపలికి వెళ్ళిపోమన్న తర్వాత ఆయన అమ్మవైపు తిరిగి 'అబ్బాయి యీ

అమ్మాయితో కలిసి కాపురం చేయటానికి వీల్లేదు,' అన్నారు.

అమ్మ వులిక్కిపడింది. నేను తెల్లబోయి చూడసాగాను.

'ఆ అమ్మాయి చేతిలో పురుష సంపర్కపు యోగం లేదు. యావజ్జీవితం కన్యగా వుండే జాతకం ఆమెది. అంటే తెలిసిందా?–'

అమ్మ నా వైపు చూసింది. పిడుగుపాటు పొందిన మనిషిలా బిగుసుకుపోయాను నేను.

'సాధ్యమైనంత త్వరలో ఆ అమ్మాయిని వదిలేసి అబ్బాయికి వేరే పెళ్ళి చేయటం మంచిది," అన్నా రాయన. అంతకంటే ఆ ప్రసంగం పెంచలేదు. కాని అమ్మకి ఆ మాటలు చాలు. మొదటినుంచీ తీర్థులుగారి మాట ఆ యింట్లో వేదవాక్కుగా పరిగణింపబడ్తోంది. నాకు జాతకాలమీద నమ్మకంలేదు. కాని ఆయన మాట శిలాశాసనం. అమ్మకి నేను యేకైక సంతానం. యెన్నడూ లేంది నాకు రామానందతీర్థులుగారి మాటమీద విసుగు జనించింది. నేను కాకుండా అమ్మకి యింకో సంతానం వుంటే యెంత బాగుండేది అని మొట్టమొదటిసారిగా అన్పించిన క్షణాలవి. కానీ నే నేంచెయ్యను. నా అభిప్రాయాలతో వాళ్ళకి పనిలేదు శైలూ! అర్థమైందా? కనీసం అమ్మ బ్రతికున్నంత కాలమైనా నేను నిన్ను పొందలేను. నన్నర్థంచేసుకో. యింతకంటే వ్రాయలేను. నేను నిన్నే కావాలని కోరి పట్టుబట్టి పెళ్ళి చేసుకున్నాననే సంగతి మర్చిపోకు శైలూ! నీ జీవితం యెలా గడుస్తుందనే బెంగ నీకు అవసరంలేదు. కాలక్షేపం లేదనుకుంటే చదువుకో, డబ్బుపంపిస్తా. నిన్నే అప్పుడప్పుడూ చూడటంకూడా నాకు వీలుపడదు. నిన్ను చూస్తే నా నిగ్రహం యెంతవరకో నేను చెప్పలేను. అందుకే చూడదల్చుకోవటంలేదు. చూడనని అమ్మకి భగవంతుని సాక్షిగా వాగ్దానం చేశాను. తర్వాత–అసలు విషయం చెప్పడం మర్చిపోయాను. యెప్పుడైనా నా తరపునుంచి యెవరయినా వచ్చి నిన్ను కాగితాలమీద సంతకం పెట్టమంటే పెట్టకు. నేను నిన్ను శారీరకంగా పొందలేకపోయినా మానసికంగా పొందాను; నువ్వు నాదానివి. ఆ విషయం మర్చిపోకు. శైలూ! బాధపడకు. నువ్వు బాధపడ్తే నిన్ను దగ్గరకు తీసుకుని ఓదార్చలేని నా అశక్తి నన్ను మంటల్లోపెట్టి కాలుస్తూంది. నా మనసుని ముక్కలు ముక్కలు చేసి నిర్దాక్షిణ్యంగా నన్ను హింసిస్తోంది. నే నప్పుడప్పుడు వుత్తరాలు వ్రాస్తూంటాను. నువ్వుకూడా జవాబు వ్రాయి."

నేను మామూలు మనిషిని కావటానికి చాలారోజులు పట్టింది. నా పరోక్షంలో రహస్యంగా ఆ వుత్తరం చదివిన అమ్మ శోకాలు మొదలుపెట్టింది.

రెండునెలల తర్వాత–సారథి మేనమామ వచ్చాడు. విషయం చెప్పి విడాకుల కోసం కాగితాలమీద సంతకం పెట్టమన్నాడు.

వీల్లేదని అమ్మ పోట్లాడింది; తిట్టింది; నానా శాపనార్థాలు పెట్టి యేడ్చింది. నేను మౌనంగా కాగితాలు అందుకొని సంతకం పెట్టి యిచ్చాను. నా ద్వారా సారథికి అశుభం జరగటానికి వీల్లేదు. సారథి పేరుమీద తర్వాత వుత్తరం వ్రాశాను. నిజంగా అతనికి రెండోపెళ్ళి చేసుకోవాలనే కోర్కె లేకపోతే నా సంతకాలు యేం చెయ్యలేవని తెలియజేశాను. ఒకవేళ యే కారణాలచేతనైనా పెళ్ళికి ఒప్పుకున్నా నేను బాధపడనని చెప్పాను. పెళ్ళి చేసుకున్నా నామీద అతనికి అధికారం పోదు నీ మీద నాకు అధికారం వుండదేమో. కాని నామీద నీ హక్కు జీవితాంతం వుంటుంది. వుత్తరాలు వ్రాయడం మానవద్దని కోరాను.

నేను వ్రాసిన వుత్తరం అతనికి అందిందో లేదో నాకు తెలియలేదు. తర్వాత అతనినుంచి నా కెటువంటి జవాబూ రాలేదు. యే సంగతీ తెలియలేదు. మళ్ళీ నా కతను కన్పించలేదు. కనీసం నే నేమైపోయానో కూడా తెలుసుకోటానికి ప్రయత్నించలేదు.

భర్త వదిలేసిన స్త్రీకి మన సంఘంలో యేలాంటి గౌరవం వుంటుందో మీ అందరికీ తెలుసు. ఆ వూళ్ళో వుండడం దుర్భరం అయింది. అమ్మని తీసుకుని మా దూరబంధువైన గోపాలరావుగారింటికి వచ్చేశాను. సంతానంలేని ఆ దంపతులకి నా రాక ఆనందాన్నే కలిగించడం నా అదృష్టం. అమ్మ యెక్కువకాలం బ్రతకలేదు. చివరిరోజులు నిశ్చింతగానే వెళ్ళినాయనిమాత్రం చెప్పగలను. బాబాయి నాకు వేరే పెళ్ళి చేస్తా నన్నాడు. నేను యిష్టపడలేదు. వేరే మనిషిస్పర్శ వూహాకూడా నాకు కంపరం కలిగించేది. సారథి నా భర్తగా పొందలేని యీ దౌర్భాగ్య జీవితానికి యింకో మనిషి అనవసరం అన్పించింది. బాబాయి సలహా ననుసరించి నర్సింగ్ కోర్సులో చేరాను. శిక్షణ కాలం పూర్తయింది. బాబాయికి బాగా తెలిసిన యీ నర్సింగ్ హోంలో నర్సుగా చేరికూడా నాలుగు సంవత్సరాలు కావస్తోంది. నాకిక్కడే హాయిగా ప్రశాంతంగా వుంది. నా తోటి నర్స్ పద్మ నన్ను ప్రాణంగా చూస్తుంది. ఇద్దరం కలిసి ఒకే యింట్లో వుంటున్నాం. మెల్లగా గతం గురించి మర్చిపోతున్న సమయంలో యిన్ని సంవత్సరాలకు మళ్ళీ సారథి యిలా కన్పించి, నాలో మానుతున్న పాత గాయాన్ని నిర్దాక్షిణ్యంగా రేపాడు. అతని మాటలద్వారానే పెళ్ళయిందనీ, ఇద్దరు పిల్లలనీ తెలుసుకున్నాను.

గదిలోపలినుంచి మూలుగు విన్పించటంతో వులిక్కిపడి లోపలికి పరుగెత్తాను. యెంత మందమతిని. డాక్టర్ హెచ్చరిక మర్చిపోయి దాదాపు రెండుగంటలసేపు వరండాలో నిలబడ్డాను.

వరనగా మూడు రాత్రిళ్ళు - మూడు పగళ్లు ఆ జబ్బుతో పోరాపోరీ పోట్లాడి సారథిని బ్రతికించుకున్నాను నేను.

"ఇంకా యెన్నాళ్ళలా కూర్చుంటావు? యిక ఫర్వాలేదని డాక్టరుగారు చెప్పారుగా - వెళ్ళు. నేను కూర్చుంటాను;" పద్మ వచ్చి బలవంతం చేయటంతో తప్పనిసరిగా విశ్రాంతి తీసుకోటానికి యింటికి వెళ్ళాను.

మూడు రోజులు తదేకంగా కూర్చోవటంవల్ల శారీరకంగా కలిగిన అలసటకంటే, విపరీతమైన ఆలోచనల్తో సాధిస్తున్న అశాంతిని భరించలేకుండా వున్నాను. ఆ రోజంతా గడిచిపోయింది.

మర్నాడు సాయంత్రం పద్మ వచ్చి సారథి కులాసాగానే వున్నాడనీ, మాట్లాడుతున్నాడనీ చెప్పింది. తృప్తితో నిట్టూర్పు విడిచాను. మళ్ళీ నర్స్‌గా అతని కెదురుగుండా వెళ్ళే ధైర్యం చాల్లేదు. ఒంట్లో బాగాలేదని వంక పెట్టి యింట్లోనే కూర్చున్నాను.

రెండు రోజులు గడిచిన తర్వాత పద్మ యింటికి వచ్చి డ్రెస్ మార్చుకుంటూ "అతను నిన్ను చూడాలంటున్నాడు" అంది.

"నన్నా ?- "


"అవును; 'నిన్ను బ్రతికించిన క్రెడిట్ మా నర్స్‌ది' అన్నారట డాక్టరు. అది గాకుండా నీ ముఖం అతనికి గుర్తుందిట."

నా గుండె లయతప్పింది. "అందుకే నీకు స్వయంగా కృతజ్ఞతలు చెప్పుకోవాలని ఆరాటపడుతున్నాడు," అంది.

"అది నా డ్యూటీ అని చెప్పు," అన్నాను.

"యేమో బాబూ! నాకు తెలియదు. నువ్వే చెప్పు."

"పద్మా! ఆ నర్సు నువ్వే నని చెప్పకూడదూ ?-"




"అంత తేలికగా మోసపోయే మనిషిలా లేడు." పద్మ నవ్వి బాత్‌రూమ్ వైపు వెళ్ళిపోయింది.

ఆ సాయంత్రం పద్మకి ఆఫ్. యెవరో ఫ్రెండ్‌తో సినిమాకు వెడ్తోంది. డాక్టరు కబురు చేయటంవల్ల నేను తప్పనిసరిగా వెళ్ళాల్సివచ్చింది.

డాక్టరు నన్ను చూడగానే "నీ ఒంట్లో యేలావుంది? 8 గదిలో పేషెంట్ నిన్ను చూడాలని తపిస్తున్నాడు. వెళ్లు, వెళ్ళి ఒక్కసారి కన్పించిరా" అని వెళ్ళిపోయారు. డాక్టర్ మాటకి యెదురు చెప్పే సాహసం నా కెక్కడిది.

నేను వెళ్ళేసరికి గదిలో దిండ్లకి జేరగిలబడి కూర్చుని పరధ్యానంగా కిటికీలోంచి బైటకి చూస్తున్నాడు. సాయంకాలం కావడంవల్ల గదిలో సంధ్యచీకట్లు ఆవరిస్తున్నాయి. నా డ్రెస్‌నిబట్టి నర్స్‌ని అని తప్ప అతను ప్రత్యేకంగా నా ముఖం చూడలేదు.

"నర్స్. చిన్నపని చేసిపెట్టాలి."

"యేమిటది ?-"

నా కంఠస్వరం వింటూనే అతను వులికి పడ్డట్టు చూశాడు. నా ముఖం కొద్దిగా చీకట్లో వుండేట్టు జాగ్రత్త పడ్డాను. క్షణంసేపు నా వైపు చూసిన అతను "నన్ను - నన్నంత జాగ్రత్తగా చూసి కంటికి రెప్పలా కాపాడింది నువ్వేనా?" అన్నాడు.

"ఇక్కడికి వచ్చిన ప్రతి రోగికీ మా శాయశక్తులా సేవచేయటము మా ధర్మం. మీకు చేసినదాంట్లో ప్రత్యేకత యేంలేదు." నాకు తెలియకుండానే ఆ మాటలు వాడిగా వచ్చాయి.

అతను తెల్లబోయినట్టు చూశాడు.

"చెప్పండి, యేం పని చేసిపెట్టాలి."

"తెల్ల కాగితం కావాలి. వుత్తరం వ్రాసిపెట్టాలి."

"ఇప్పుడే తెస్తా." గదిలోంచి పారిపోయాను.

పది నిమిషాలు పోయిం తర్వాత కాగితం కలంతో తిరిగి వచ్చాను.

"కొద్దిగా వ్రాసి పెట్తావా? నేను వ్రాయలేను."

"అలాగే "

అతను కళ్ళు మూసుకుని వెనక్కు వాలి పడుకున్నాడు. గదిలో లైటు వేసి క్రీనీడలో కూర్చుని వ్రాయటం ప్రారంభించాను.

"ప్రియమైన కమలకి—"

అతను చెప్పటం ప్రారంభించాడు.

ఆ మాట వ్రాయటం వ్రాశాను. కాని చేతులు వణకటంమాత్రం నిగ్రహించుకోలేకపోయాను.

అతనలా కళ్లుమూసుకునే చెబుతున్నాడు.

"నేనిక్కడ కులాసాగానే వున్నాను. అనుకోకుండా కాస్త జ్వరం తగలటంవల్ల తప్పని సరిగా నర్సింగ్ హోమ్‌లో చేరాల్సి వచ్చింది. ఖంగారుపడకు. జ్వరం తగ్గిపోయింది. నాలుగైదు రోజుల్లో బైలుదేరి వస్తాను. బాబుకి, పాపకి నా తియతీయటి ముద్దులు."

యెంత ప్రయత్నించినా నేను వుత్తరం వ్రాయలేకపోయాను. నాకు శక్తి చాలలేదు. కాగితం కలం తీసి అక్కడ పారేసి బైటకి వచ్చేశాను. బహుశా అతను అర్థంగానట్టు చూసి వుండచ్చు. అందుకే వెనకనుంచి "నర్స్, అదేమిటి వెళ్ళిపోతావేం?" అన్న కేక విన్పించింది.

నేను మళ్ళీ ఆ గదిలోకి వెళ్ళలేదు. అతను పిలవలేదు. రాత్రి 12 గంటలకి మందు యిచ్చి టెంపరేచర్ చూడాలి. మనసు కుదుటపరుచుకున్న నేను దృఢంగా, నిశ్చలంగా గదిలోకి వెళ్ళాను. అతను నిద్రపోతున్నాడు. వుత్తరం నేను పెట్టినచోట అలాగే వుంది. క్షణంసేపు అతన్ని చూస్తూ అలాగే నిలబడిపోయాను. ఆ సారథికీ యీ సారథికీ ఆట్టే వ్యత్యాసం లేదు. అప్పుడు బాగా బక్కపలచగా వుండేవాడు. యిప్పుడు కాస్త బలం వచ్చినవాడుగా వున్నాడు. మనిషిలో వయసు తెచ్చిన గంభీరత్వంకూడా వుంది. అనారోగ్యంతో చిక్కిపోయికూడా ఆ ముఖం యెంత ఆకర్షణీయంగా వుంది! నిద్రలో అతనిముఖంలో కన్పిస్తున్న ప్రశాంతత నా దురదృష్టాన్ని వెక్కిరించ సాగింది.

లేచి మందు యిచ్చాను. బద్ధకంగా బరువుగా మూతలు పడ్తున్న కళ్ళతో మందు తాగేశాడు. థర్మామీటర్ నోట్లో పెట్టి విసుగ్గా వూరుకున్నాడు. నోట్లోంచి తీస్తూండగా.

"నర్స్! యిందాక యెందుకలా పారిపోయావు?" అన్నాడు. అప్పటికే అతనికళ్ళు మళ్ళీ మూతలు పడ్తున్నాయి.

నేను సమాధానం చెప్పలేదు.

అతనింకేమీ అడగలేదు.

బైటకి వచ్చేశాను. అతను నన్ను గుర్తుపట్టలేదు. ముఖాముఖి చూసికూడా పోల్చుకోలేదు. ఈ దారుణమైన సత్యం నా గుండెల్ని వేయిరంపాలతో చీల్చ సాగింది. యేమైనాసరే! రేపు వుదయం యెదురుపడాలి. ఒకవేళ గుర్తువట్టకపోతే ఫలానా అని గుర్తుచేయాలి. గుర్తుచేసి అతనెలా ప్రవర్తిస్తాడో చూడాలి. గట్టిగా నిశ్చయించుకున్నాను.

మర్నాడు వగలుడ్యూటీ మేరీది.

సాయంత్రంవరకూ వేచివుండక తప్పలేదు.

రాత్రి 7—8 గంటలమధ్య మందు తీసుకుని వెళ్ళాను. అతను మంచంమీద కూర్చుని పుస్తకం తిరగేస్తున్నాడు. నిన్నటికంటే కులాసాగానే వున్నాడు. అతనెలాగో నన్ను గుర్తుపట్టలేదు. ధైర్యంగా నిస్సంకోచంగా దగ్గిరకు వెళ్ళి మందిచ్చాను. మందుగ్లాసు అందుకుంటున్న అతను క్షణంసేపు నావైపు చూశాడు. నేనుకూడా చూశాను. ఇద్దరి చూపులూ కలుసుకుని వెనవేనుకున్నాయి. అతను వింతగా ప్రశ్నార్థకంగా చూశాడు. చూస్తూండగా అనారోగ్యంతో చిక్కిపోయిన అతనికళ్ళు ఆశ్చర్యంతో పెద్దవైనాయి. మందుగ్లాసు పట్టుకున్న నాచేయి వణికింది.

"శైలూ!" పెదవులు అస్పష్టంగా పలికినాయి. కళ్లు యింకా కలా, నిజమా అన్నట్టు అలాగే అపనమ్మకంతో గుచ్చి చూస్తున్నాయి.

"నేనిక్కడ నర్స్‌ని—శైలజని కాదు."

"అదే. యెందుకని? యెలా-నువ్విక్కడ-" అతను తడబడ్తున్నాడు.

"మందు తీసుకోండి-"

"అయితే-నువ్వు - నువ్వేనా-నన్నిలా జాగ్రత్తగా చూసింది."

నేను సమాధానం చెప్పలేదు. ఆ మాటలూ, ఆ పలికే తీరూ చూస్తూంటే అతను నన్ను నేను అనుకున్నంతగా మర్చిపోలేదని తెలుస్తోంది.

"నువ్వు - నువ్వు వేరేపెళ్ళి చేసుకోలేదూ!"

"అంతా మీలా వుండరు. విడిచిన బట్టని తీసిపారేసినట్టు మనుష్యుల్ని జీవితాల్లోంచి తీసి పారెయ్యటం అందరికీ సాధ్యంకాదు."

క్షణంసేపు భయంకరమైన నిశ్శబ్దం యేర్పడింది.


"మందు తీసుకోండి. మీ రిక్కడ నన్ను చూసి భయపడాల్సిన అవసరం యేమీలేదు. శైలజ మీరు వదిలేసిననాడే చచ్చిపోయింది. ఇప్పుడు యిక్కడుంది కేవలం నర్స్. ఆ నర్స్ యే విధంగానూ మీ జీవితంలో ప్రవేశించదు. పాత బంధాన్ని పైకి తీయాలని ప్రయత్నం చేయదు."

అతడు నా చేతిలో మందుగ్లాసు వదిలేసి వెనక్కు తగ్గాడు. హఠాత్తుగా షాక్ తిన్న అతనిముఖం పాలిపోయి నీరసంగా మారడం నేను గమనించకపోలేదు.

"అయితే ఉత్తరం వ్రాస్తూ నిన్న నువ్వు పారిపోయింది-" వాక్యం పూర్తి చేయకుండా ఆపేశాడు.

నేను వంచినతల యెత్తలేదు. అడగాలని సిద్ధంచేసుకున్న మాటలన్నీ గాలిలో కలిసిపోయినాయి. మాటలు రాని మూగదానిలా నిలబడిపోయాను.

హఠాత్తుగా ముందుకు వంగి నా చెయి పట్టుకుంటూ "నిజం చెప్పు. ఇన్నాళ్ల నీ జీవితంలో నేను నిష్క్రమించినతర్వాత యింకెవరూ రాలేదా?—" అన్నాడు.




"నేను రానివ్వలేదు."

అప్రతిభుడైనట్టు చూశాడతను.

"మీరు మందు తాగితే నేను వెళ్ళి పోతా–" నాకక్కడ వూపిరి ఆడటం లేదు.

అతను సమాధానంగా రెండుచేతులూ పట్టి మంచంమీదికి లాగాడు. అనుకోకుండా అతను చేసిన పనితో అతని దగ్గిరగా మంచంమీద కూలపడ్డాను. వెంటనే లేవబోయాను. కాని లేవనీయలేదు. నా చెయి గట్టిగా అలాగే పట్టుకుని, "నిన్ను-నిన్నిలా మళ్ళీ చూస్తానని కల్లోకూడా అనుకోలేదు." అంటుండగానే అతని కంఠం వణికింది. అతన్ని చూసినప్పటి నుంచీ యీ క్షణంవరకూ నేను మూగగా అనుభవిస్తున్న దుఃఖానికి ఆ మాట ఆనకట్టలు తెంచింది.

"శైలూ! శైలూ!–" అప్యాయంగా దగ్గరికి తీసుకుని జుట్టుని సవరించాడు; చెక్కిళ్ళని నిమిరాడు. అలా యెంత సేపు అతని చేతులమధ్య యిమిడిపోయి యేడుస్తూండిపోయానో నాకు స్పృహే లేదు.

అర్ధరాత్రి దాటింతర్వాత అతన్ని బలవంతంగా నిద్రపుచ్చి బైటికి వచ్చాను. యెన్ని ఖబుర్లు? యిన్ని సంవత్సరాల యీ వియోగంలో నాపట్ల అతని అనురాగం ఆవగింజంతకూడా తగ్గలేదు. తల్లి బలవంతంమీద పెళ్ళి చేసుకున్నమాట నిజమే. కాని ఆవిడ రెండుసంవత్సరాల్లోనే పోయింది. నాకోసం తర్వాత వెతికాడుట; ఆ వూరు వెళ్ళి వాకబు చేస్తే వెళ్ళిపోయిందని. యెవరినో పెళ్ళి చేసుకుందని చెప్పారుట. గదిలోంచి బైటకిరాగానే చల్లటిగాలి నా ముఖానికి తగిలింది. తేలికగా నిట్టూర్చాను. మనసులోని కొండంత భారం దిగింది.

ఆ మర్నాడు అర్జెంట్ కేసు వచ్చి ఆపరేషన్ గదిలో వుండడంవల్ల అతనిదగ్గరికి వెళ్ళలేకపోయాను. దాదాపు సాయంత్రం నాలుగవుతుండగా గబగబా అతని గదిలోకి పరుగెత్తాను. యెప్పుడెప్పుడు చూస్తానా అన్న ఆత్రం నన్ను వుదయం నుంచీ ఆవేశించింది,

దాదాపు పరుగెత్తుకొస్తున్న నేను గదిలోకివచ్చిరాగానే మీట నొక్కినట్టు ఆగిపోయాను. గదిలో సారథి మంచంమీద అతని గుండెల కంటుకుపోయి ఒకావిడ వెక్కివెక్కి యేడుస్తోంది. అతను ఓదారుస్తున్నాడు.

సారథి నన్ను చూడకపోతే గిరుక్కున వెనక్కు తిరిగి వెళ్ళిపోయేదాన్ని. కాని సమయం మించిపోయింది.

"అదుగో నర్సు వచ్చింది, లే కమలా!" భార్యని బలవంతంగా భుజాలుపట్టి లేవదీస్తూ అన్నాడు. ఆ మాట అనేప్పుడు అతని ముఖం యెర్రబడటం నేను గమనించకపోలేదు.

ఆవిడ సరిగ్గా కూర్చుని చీరచెంగుతో కళ్ళు తుడుచుకుంది.

నేను మరో రెండు నిమిషాల్లో క్షమార్పణ చెప్పుకుని సారథి పిలుస్తున్నా విన్పించుకోకుండా బైటికి వచ్చేశాను.

అన్నింటికంటే భయంకరమైన సత్యం, రాత్రి నేను సరిగ్గా అలాగే అతని గుండెల్లో తల దాచుకుని యేడ్చాను. కాని నా యేడుపుకీ ఆమె యేడుపుకీ యెంత వ్యత్యాసం. ఇక్కడ తెలిసినవాళ్ళెవరో సారథికి ఒంట్లో బాగాలేదని టెలిగ్రాం యిస్తే ఆవిడ పరుగెత్తుకు వచ్చింది. ఆదుర్దా పడడంలో ఆవిడకి ఆ అధికారం వుంది. కాని నాకు, నేనెవర్ని అతనికి.

మర్నాడు పద్మద్వారా నాకు ఆవిడ ఒక కంచి పట్టుచీర, పళ్లు, పువ్వులు పంపింది. వాటితో "నీ ఋణం జన్మలో తీర్చుకోలేను. నా భర్తని నాకు ప్రసాదించిన అమృతమూర్తివి నువ్వు. నా యీ చిన్న కానుకని స్వీకరించు-కమల." అని వుంది. నేను వాటిని తిప్పిపంపేస్తూ "నా ధర్మాన్ని నేను నెరవేర్చాను. యీ కృతజ్ఞతలు అనే అడంబరంతో నన్ను అవమానించవద్దు-నర్స్" అని వ్రాసిపంపాను.

"వాళ్ళు వెళ్ళిపోయేముందు, నిన్ను చూసితీరాలిట. నువ్వు రాకపోతే రేపు మనింటికి వాళ్ళే స్వయంగా వస్తారుట." అంది పద్మ.

"రానీ! రేపు నేనిక్కడ వుంటేకదా'" అన్నాను నిర్లక్ష్యంగా.

"అంటే–" పద్మ కింతవరకూ అసలు సంగతి తెలియదు.

"నేను వుద్యోగం మానేస్తున్నాను."

"నీకేమైనా మతిపోయిందా?–"

"యిక్కడుంటే పోతుందని భయంగా వుంది. సాయంత్రమే బాబాయి దగ్గరికి వెళ్ళిపోతున్నాను."

"శైలా! నన్ను చంపకు. అసలు విషయం చెప్పు." పద్మ ప్రాధేయపడింది.

క్లుప్తంగా జరిగిందంతా చెప్పాను.

"నువ్వెంత గట్టిదానివి. యిన్ని రోజుల నుంచీ నాకు ఒక్కమాట అయినా చెప్పలేదు," నిష్టురంగా అంది పద్మ.

కొద్దిసేపయింతర్వాత "నువ్వు అతన్ని తప్పించుకోవాలని వుద్యోగం మానివేస్తానంటున్నావు. కాని యెక్కడున్నా నిన్నతను పట్టుకోడని యేం నమ్మకం" అంది.

అదీ నిజమే అన్పించింది.

ఏమైనా సరే ఆ రాత్రే కొద్దిరోజులు ఆ వూరునుంచి వెళ్ళిపోవటానికి నిశ్చయించుకున్నాను. పద్మద్వారా డాక్టరు గారికి శలవు వ్రాసి పంపాను.

సాయింత్రం కూర్చుని పెట్టె సర్దుకుంటున్నాను.

ఇంతలో వీధి తలుపు చప్పుడైంది.

"వస్తున్నా పద్మా," అంటూ వెళ్ళి తలుపు తీశాను. తీస్తునే కొయ్యబారి పోయాను. యెదురుగుండా సారధి నిలబడి వున్నాడు.

"శైలూ!" అతను నవ్వబోయాడు, కాని నవ్వు రాలేదు.

లోపలికి రావటానికి తప్పని సరిగా దారి యివ్వాల్సి వచ్చింది.

"వూరు వెడ్తున్నావని పద్మ చెప్పింది నిజమేనా?–"

నమ్మకద్రోహి. కృతఘ్నురాలు. స్నేహం అన్న పదంలోని పవిత్రతే చెడగొట్టింది. పద్మమీద ఒళ్ళు మండిపోయింది.

"యెక్కడికి వెడ్తావు?–"

"బాబాయి వరస అయిన దూరపు బంధువు ఒకాయన వున్నాడు. అయనే నాకిదంతా చేసింది. అయన దగ్గరకి వెడ్తాను."

"యిప్పుడంత అవసరం యేమొచ్చింది?–"

"నా కిక్కడ బాగాలేదు."

"నా మూలంగానేగా!–"

నేను మాట్లాడలేదు.

అతను లేచి దగ్గరగా వచ్చాడు "శైలూ! మళ్ళీ కంటికి కన్పించినతర్వాత నిన్నిలా ఒంటరిగా వదిలేస్తాననే నమ్ముతున్నావా?–"

"వదిలేయక చేసేదేముంది."

"నా యింటికి తీసుకువెడ్తాను. వుద్యోగము వదిలేయాలని వుంటే వదిలేయ్. కాని నా భార్యగా నా యింటికి రా!–"

"కమల?–"

"కమలకి నేనంతా చెప్పేస్తాను. యిప్పుడే యీ క్షణంలోనే చెప్పేవాడిని కాని కమల గుండెజబ్బు మనిషి. కొద్దిగా నెమ్మదిగా, ప్రశాంతంగా చెప్పాలి. అందుకే యీ రోజే మేం యిద్దరం వెళ్ళిపోతున్నాం. నాలుగు రోజుల్లో నిన్ను తీసుకెళ్లటానికి వస్తాను."

"కమల ఒప్పుకోకపోతే?–"

"ఒప్పుకొంటుంది." దృఢంగా అన్నాడు.

ఇద్దరి మధ్యా మౌనం యేర్పడింది.

'కానీ, కానీ. నా జాతకం మంచిది కాదు–ఒకవేళ–" నన్ను అత సామధ్యలోనే అపు చేశాడు" యేదయినా అయినా భయ్యాలేదు. మొన్న ప్వరంలో యీ జీవితం కవలం నువ్వు ప్రసాదించిందే!"

నాలుగురోజుల్లో తిరిగివచ్చి నిన్ను తీసుకువెళ్ళేట్లు. ఈలోపల నే నేపిచ్చి పనులూ చేయకుండా అతనికోసం యెదురు చూసేట్టు వాగ్దానం చేయించుకుని సారథి వెళ్ళాడు.

శిలాప్రతిమలా అలాగే కూర్చుండి పోయాను. అత నెంత ఆదరంగా చూడనీ, యెన్ని వాగ్దానాలయినా చెయ్యనీ తిరిగి అతని జీవితంలో నేను ప్రవేశించలేను. కమల అతని మాటకి యెదురాడే సాహసం లేక ఒప్పుకోవచ్చు. కాని కళకళలాడే ఆ సంసారం మధ్య నే నెలా వుంటాను. నే నేంచెయ్యాలి? అతను తిరిగి వచ్చేంతవరకూ వేచివుంటానని యిచ్చిన మాట నిలుపుకోవటమా? లేక నిర్లక్ష్యంగా వెళ్ళిపోవడమా? భగవాన్! నాకు సరైన మార్గం చూపించు. మనసులో భగవంతుడిని వేడుకోసాగాను. నాకు తెలియకుండానే నా కళ్ళనుంచి నీళ్ళు కారసాగినాయి. సారధి నన్ను మర్చిపోలేదు. అతని మనసులో నా స్థానం చెక్కుచెదరలేదు. ఆ తృప్తి చాలదూ నాకు!

"అమ్మాయ్. హాస్పిటల్‌నుంచి నీకు ఫోన్ వచ్చింది."

ఇంటిగలావిడ కేక వేయడంతో వులిక్కిపడి కళ్ళు తుడుచుకున్నాను. బహుశా డాక్టరుగారయివుంటారు. శలవు యివ్వటానికి ఒప్పుకోక ఫోన్ చేసివుండవచ్చు.

"ఇంట్లో లేనని చెప్పండి పిన్నిగారూ" అన్నాను.

నేను వెళ్ళిపోతాను. సారధి కిచ్చిన మాట నిలుపుకోను. అందుకనే అతని మంచి వుందని నా విశ్వాసం. లేచివెళ్ళి బట్టలు సర్దుకోవటం ప్రారంభించాను.

"అమ్మా! పద్మతల్లి నిన్ను పిలుస్తోంది." మళ్ళీ పిల్చింది. ఆవిడ పద్మ పేరు చెప్పగానే నాకు యింకా ఒళ్లు మండింది. తను చేసిన ఘనకార్యం యెలా పరిణ



మించిందో ఫలితం తెలుసుకోవాలని ఆత్రం కాబోలు.

"సారథితో వెళ్లానని చెప్పండి." అన్నాను కరకుగా.

రెండు నిమిషాల్లో పిన్నిగారి కంఠం మళ్ళీ కంచుగంటలా మోగింది "అబ్బబ్బ. నాకు తెలియదమ్మా; నువ్వువచ్చి మాట్లాడు, అర్జెంట్ అంటోంది. యెవరికో యాక్సిడెంట్ అయిందిట" ఆవిడ విసుక్కుంది.

నేను చీరెలు మంచంమీద పడేసి ఫోన్ దగ్గిరకి వెళ్ళాను.

"హలో శైలూ నువ్వేనా?"

"ఆ! యేం మహారాణి!''

"శైలూ! సారథి.''

"వచ్చాడు, వెళ్లాడు. నిన్ను జన్మలో క్షమించను."

"అబ్బబ్బ! నామాట విను. అతనికి యాక్సిడెంట్ అయింది. హాస్పిటల్‌కి తీసుకువచ్చారు. నువ్వు త్వరగా రా!-''

"ఆఁ!"

"నిజం. త్వరగా రావాలి. దెబ్బలు బాగా తగిలాయి, తలమీద పెద్దగాయం అయింది. ఆపరేషన్ థియటర్లో వున్నాడు.''

"పద్మా -" బిగుసుకుపోతూ పిల్చాను.

"నాకు టైమ్‌లేదు, నువ్వువచ్చెయ్యి." పద్మ ఫోన్ పెట్టేసింది.

హాస్పిటల్‌కి యెలా వెళ్ళాలో నాకే గుర్తులేదు. నేను వెళ్ళేసరికి చాలా హడావిడిగా ఉన్నారంతా. నన్నుచూడగానే పద్మ పరుగెత్తుకొచ్చింది. ముఖం నిండా చెమటలు పట్టాయి. ''యింత ఆలస్యం అయిందే,'' అంది.

"రిక్షా దొరకలేదు. యెలా వుంది?-"

"రా! చూద్దువుగాని -" పద్మ చెయి పట్టుకుని లాక్కెళ్ళింది. ఆపరేషన్ టేబిల్ మీదే వున్నాడు. తలమీద చాలా పెద్ద గాయాలున్నట్టు బాండేజ్ చెప్తోంది.

నిద్రపోతున్నట్టు నిలువుగా పడుకునున్న అతని మీదపడి కమల రోదిస్తోంది.

గుమ్మంలో యెదురైన డాక్టర్ నన్ను చూసి తల వూపుతూ "చాలా ట్రాజెడీ! అంత జబ్బును కోలుకుని యిలా అకస్మాత్తుగా పోవటం. హు! మృత్యువు యెప్పుడు యేరూపంలో వస్తుందో యెవరికి తెలుసు?'' అన్నారాయన.

పద్మ నాచెయి గట్టిగా పట్టుకుంది.

ఇంకో నర్స్ అతని ముఖంమీద గుడ్డ కప్పేసింది. కమల ఘొల్లుమంది.

పద్మ నా చెవిలో రహస్యంగా ''ఆఖరి సారి అతను శైలూ - శైలూ అన్నాడు తెలుసా?'' అంటోంది. కానీ నాకివేవీ విన్పించటం లేదు. ప్రపంచం అంతా గిర్రున తిరుగుతోంది. నేను యెక్కడికో అంతులేని అఘూతంలోకి జారిపోతున్నాను. వెంటనే కెవ్వుమన్నాను. ఆ తర్వాత యేమైందో నాకు తెలియదు.